# “కుశలంబేగదా ఆంజనేయ”

-------- మారుతి పౌరోహితం.

(9440205303)

“ ఎప్పుడూ ఆ హార్మోని వాన్చుకుంటా పద్యాలు సేప్పుకుంటా ఉండేదేనా ? నానొక్కదాన్నే దుడసాలంటే యాటికి? సిన్నమల్లారొడ్డి బాయి తోగే దగ్గర కూలోల్ల లెక్కలు రాసేకన్నా రాప్పా అని పిలిస్య! సెవులోన ఏసుకొంటివా ? పిల్లోల్లిద్దరు హాస్టల్లోన ఉండారు కాబట్టి సరిపోయా ల్యాకపోతే ఏంగతి అయిపోతుండిరో !“ అని నిష్ఠూరంగా అన్య సుంకమ్మ .

సుంకమ్మ మాటలు ఇనిపిచ్చుకోకుండా గుడిసే ముందు వారసప్పరం కింద హార్మోని పెట్టెని తీస్య పాండురంగయ్య. పాత కిర్లోస్కర్ ఇనపకుర్సీ తీసుకోనీక్య గుడిసేలోకొచ్చ్య .

“ ఆ బాయికాడ లెక్కలు రాసేకి అన్నా పోరాదా?” అని మరొకసారి అన్య సుంకమ్మ .

“ ఏంటికరుస్తావు ఊరిక్య . మొన్న అల్వాలోల్లు డ్రామా నేర్పించేకి రమ్మని వొచ్చిండిరి కదా ? వారం దినాలు దాటినంక వొస్తామనేర్యల్యా !అల్వాలకి ఫోతాను . నువ్వొక్కటే బూడిద పూసుకొని ఇంట్ల దొర్లాడుదువుల్యా “ అనుకొంటా కోపంగా కుర్సీని కింద పడేస్య పాండురంగయ్య.

“ ఉన్న మాటంటే ఉండూర్ల ఉండొద్దు అనిన్నంట నీఅట్లాంటోడు . వారం ఎల్లిఫోయి అయిదు దినాలాయ . యాడొచ్చిరి ? “ అని తిరగమల్య సుంకమ్మ .

“ వొస్తారు . ఓపిక ఉండల్లా . అన్నీ సరిసూసుకొని రావొద్దా? . అదేమి సేన్ల కలుపులు తీసేది అనుకొంటివా ? డ్రామా అంటే ఊరూరే మాట్లాడుకోవల్ల “ అని విసుక్కొంటా కుర్సీని బర బారా ఈడ్చుకుంటా బయటికి తీసక పాయ పాండురంగయ్య.

ఈయప్ప యానాడన్నా నామాట వినేద్యనా ? అని మనసుల అనుకుంటా సద్దిగిన్నె తీసుకొని గుడిసె తడిక వాకిలి ముందుకి ఏసి బయటికి వొచ్చి “ ఫొప్పు, బువ్వ కుండల పెట్టి ఉట్టి మీద పెట్టేన్య . తాగేకి నీళ్ళు లేవు సూడి. సేదబాయికి పోయి ఒక కడవ నీల్లెత్తుకొచ్చుకో. నాను కూలికి ఫోతండాను. యాలయ్యేద్య “ అని సెప్పుకుంటా సుంకమ్మ ఒక సేతుల కుర్సికి పట్టుకొని , సద్దిగిన్య నెత్తిమీద పెట్టుకొని ఇంగోసేతుల గొర్రె పిల్లతాడుని పట్టుకొని అది ఎనక్కి గుంజుతుంటే ఈయమ్మ దాన్ని ఈడ్చుకుంటా ఈడిగోల్ల సేనికి బయలుదేర్య. పాండురంగయ్య పెండ్లాం మాటలు వినీ విననట్ల వారసప్పరం కింద కూసోని హార్మోని పెట్టె వాంచేది మొదులు పెట్య .

” సర్వ రాజ్యమును తృణప్రాయంబుగా నెంచి “ అని పద్యం ఎత్తుకున్య . ఈరకంగా పాండురంగయ్య ఒంటేడుదిన్నె లో తన కొట్టం వారసప్పరంలో పద్యం పాడుతున్నప్పుడే .......

కర్నూలుల కల్కూర హొటలు ఎనకాల డ్రామా ఆడేఆయమ్మ రంగాబాయి ఇంట్ల కాపీ తాగుతా ఉండాడు పలుకూరు తిమ్మయ్య . పలుకూరు తిమ్మయ్య రంగాబాయి యాడన్నా డ్రామా ఆడడానికి పొతే ఆయమ్మ ఎనకాల పోయి ఆయమ్మ పద్యాలకి హార్మోనీ వాయించే హార్మోనిష్టు. ఆయమ్మ రాగాలు వేరేవోల్లకి వాయిన్చేకి రాదని పలుకూరు తిమ్మయ్యని వెంట పిలసక పోతాది.

కాపీలోటాని నీళ్లత కడిగి బోర్లా పెడతా " ఏమన్నా గిరాకీలు వచ్చేనామ్మా ?" అని అడిగినాడు రంగాబాయిని. "ఒకరిద్దరు వచ్చిపొయ్యేర్య. రేపు వారంల వొచ్చి సంస్కారం ఇచ్చి పోతామనేర్య. వానలు లేవుకదా! జనాల సేతుల్ల దుడ్లు ఆడల్ల గదా " అనె రంగాబాయి.

" ఆదీ నిజమే ! గాలికి పెట్టుకునేద్య . పంటలు పండితేనే గదా మనలాంటోల్లకి పని " అనుకొంటా భుజం మీద శాలువాను సర్దుకొన్య పలుకూరు తిమ్మయ్య.

"రేపు వారంల ఒకసారి ఒచ్చిపో . ఏమన్నా వుంటే సెబుతాను" అన్య రంగాబాయి.

" యాదోమ్మా ! నిన్ని నమ్ముకొని ఉండాను. వయసు ఆయ కదా ? యావూరికన్నా పొయి నేర్పిద్ధాం అంటే సత్తువ సాలకుంది. ఇంట్ల పిల్లలుకూడా యాటికీ పోవొదప్పా అని అంటా ఉండారు. ఈ విద్దె దుడ్లు సంపాదిన్చుకొనేకి అని ఆయప్పొల్లు అనుకొంటా ఉండారు . మన కాయాస వాళ్లకి తెలిస్తే కదా ? " అని బాధగా మాట్లాడాడు పలుకూరు తిమ్మయ్య.

" కొంతమందికి పేకాట వ్యసనం . కొంతమందికి తాగుడు వ్యసనం . మనకి ఈడ్రామాలు వ్యసనం తిమ్మయ్యా ! . దీన్నిఎవురికీ అర్థం చేయించే పనిలేదు. మనపని మనం సేసుకుంటా పోవడమే . కళను నమ్ముకొని ఉండాము కాని , అమ్ముకోనేకి కాదు " అని భారంగా చెప్పింది రంగాబాయి.

" కరేస్టు సూడమ్మ నీవనింది " అని రంగాబాయిని పలుకూరు తిమ్మయ్య మెప్పిచ్చేతట్ల మాట్లాడుతున్నప్పుడే ...........

గువ్వలదొడ్డిల నేసె నేట్టేకల్లప్ప హొటల్ల .. నేట్టేకల్లప్ప ఉగ్గానికి తిరగవాత రెడీ సేస్తుండాడు . కొడుకు సలసల కాగే నూనెల మెరపకాయ పుగ్యాలు ఏస్తూ ఉండాడు. పెండ్లాము బురుగులు నానబెడతా ఉండాది . రసూలు సాయిబు , వడ్డే వెంకటప్ప, గొరవ నాగన్న , బోయ గిడ్డప్ప , ఈడిగి చిన్నకాజన్న వండుతున్న ఉగ్గానికోసం ఎదురు సూసుకుంటా లొట్టలు ఏసుకుంటా కూసోని ఉండారు.

" యలే గిడ్డిగా ! మొన్న పెద్దమరీడు ద్యావర నాడు డ్రామా ఏసిండిరి. మా బామర్ది గాడు నారుదుని ఏసం ఏసిండ్య . ఏమేమి బాగా ఆడలేదు సూడలే " అన్య బారికి ఎంకటేసు .

" అవ్వంట మామా ! నిన్న సేన్ల నీళ్ళు కడుతుంటే పెద్దమరీడు సాకలోల్లు మన కాలవల బట్టలుతికేకి వొచ్చింద్రి . వాళ్ళు కూడా ఈమాటే అద్రి ." అన్య బోయ గిడ్డప్ప.

డ్రామా కాయాస ఉన్న గొరవ నాగన్న గబుక్కున అందుకున్య," ఆవూరోల్లని అనే పని మనకేంటికి ? మనమే ఆడదాం పటండి . ఎట్లా ఉర్సు ఇంకా ఎనిమిది నెలలు ఉండాది గదా ! . ఉర్సుకు ఆడదాం " అన్య.

" మంచి మాట అంటివి నాగిగా . నాక్కూడా శానా కాయాస ఉండాది డ్రామా ఎయ్యాలని " అని అందుకున్య వడ్డే వెంకటప్ప.

ఈల్ల మాటలన్నీ ఇంటున్న ఈడిగ చిన్న కాజన్న పెద్దమనిషి మాదిరిగా " యలే అన్నీ మీరే అనుకుంటే ఎట్లలే ? ఉర్ల పెద్దా సిన్నా ఉండొద్దా ? పెద్దమనుసులని ఒక మాట అడగాల కదా ? డ్రామంటే ఉరికందరికీ సంబరం ఉంటాది . నీకి, నాకి ఒక్కటే కాదు. అందరూ సేయి పడితేనే డ్రామా ప్యాసు అయ్యేది. ల్యాకుంటే ఆ పెద్దమరీడోల్ల డ్రామా మాదిరి అయితాది సూడి " అని హెచ్చరించ్య .

" సిన్నాయనా! అందర్నీ కాదని మాము ఏస్తామని సేప్పల్యా . మాకేం తెలదా ? డ్రామా అంటే ఉరూరే దిగాల . నువ్వు సేప్పినట్లే సేస్తాముల్యా " అన్య తంబల ఎంకటేసు.

నేట్టేకల్లు వొగ్గాని రెడీ సేస్య. కొడుకు పేపర్లు సింపి వాళ్ళ నాయనకి యిచ్చ్య. నెట్టేకల్లు పేపర్ల ఉగ్గాని , రెండు పుగ్యాలు పెట్టి అందరకీ ఇచ్చ్య.

" డ్రామా నాడు ఉగ్గాని, టీ నీవే అమ్మల్ల సూడు మామా ? బ్యారే ఊరోల్లని ఎవుర్నీ రానీయము " అని ఉగ్గాని రుసికి మర్లు అయిన రసూలు సాబు అన్య.

" వాయబ్బ ! నాను గాకుంటే ఎవుడు అమ్మనీక్య వచ్చేది ? ఊర్ని నమ్ముకొని ఉన్నోల్లము " అన్య నెట్టేకల్లు.

" సరే ల్యాండిలే ! యాల అయితా ఉండాది. ఉద్ధర మాటలు ఇడిసి ఇంగ సేన్లకి ఎలబారండి. రేపు మాదిగ బజారిత సాటింపు ఏయిస్తా . శన్యారం గిడ్డయ్య గుడి కట్టకాడికి డ్రామా కట్టే ఇసయమై మాట్లాడేకి అందరూ రావల్ల " అని సెప్ప్య ఈడిగ సిన్న కాజన్న తాగిన టీ మీసాలకి అంటుకొని ఉంటే తుడుసుకొంటా.

సరేల్యా సిన్నాయన అని అన్ని అందురూ ...

*******

ఊరి పెద్దమనుసులు , డ్రామా కట్టేకి కాయాస ఉన్నోళ్ళు అందరూ గిడ్డయ్య గుడి కట్టకాడ శన్యారం రాత్రి ఏడుగంటలకి కలిసిరి . ఈడిగ సిన్న కాజన్న మాట్లాడేకి మొదులు పెట్య. ఊర్ల పిల్లగాళ్ళు డ్రామా కట్టేకి అనుకొని ఉండారనీ దాని ఇసయం మాట్లాడేకి అందరమూ వచ్చిండామని బయటపెట్ట్య.

గొరవ పెద్ద మల్లయ్య " సూడండప్పా ! ఇది వానలకాలము. సేన్లల్ల శానా పనులుండాయి. మనూరికి ఆర్ధడి ఉండాది. వానా కాలముల వానకి , ఎండా కాలముల కాల్వ నీళ్ళకి రెండు పంటలు పండుతాయి. ఇంగా ఇప్పుడు ఆగస్టు . ఉరుసేమో ఫిబ్రవరి నెలల ఉంటాది . అప్పటికి ఎండాకాలం పంట మద్యల ఉంటాది. మీరు డ్రామా గీమా అనుకొంటా సేన్లపన్లు ఎగ్గొట్టి తిరుగుతామంటే ఒప్పేకి లేము. పని సెడకుండా అడతాము అంటే సరి " అని షరతు పెట్ట్య .

" లేదుల్యా తాతా ! అట్లెట్ల సేస్తాము? పనికి ఫోయి వొచ్చినంకనే సాధన సేస్తాము " అని హామీ ఇచ్చ్య రసూలు సాబు.

" యా డ్రామా ఆడల్లని ఉండారు ? " అని కల్లమ్మే గిడ్డయ్య అడిగ్య.

బాపనయ్య స్వామి " రామాంజనేయ యుద్ధం ఆడండి . ఊర్ల గిడ్డయ్య స్వామి ఉండాడు . ఊరికి కూడా మంచిగా ఉంటాది " అని సలహా ఇచ్చ్య.

" రామాంజనేయ యుద్ధమంటే పద్మూడు మంది కావల్ల ఏషం ఏసేకి. దాంట్ల శాంతిమతి ఏసం ఒక్కటే ఆడపాత్ర . అది మనమే ఎవురన్నా ఎయ్యోచ్చు , ల్యాకుంటే కర్నూలు నుంచి రంగాబాయిని పిలిపించొచ్చు " అన్య డ్రామాల పిచ్చి ఉన్న వడ్డే ఎంకటప్ప .ఆయప్పకి ఆయమ్మతో ఎట్లన్నా గానీ డ్రామా ఆడాలన్న కాయాస ఉంద్య. చాన్సు దొరికిందిరా అనుకొని ప్రతిపాదన పెట్ట్య .

" ఆడ ఏసము మొగోళ్ళు ఏసేది ఒద్దుల్యా. ఆయమ్మనే పిలిపిద్దాం " అన్య ఈడిగ పెద్ద అంజినయ్య.

" అట్లయితే పన్నెండు మంది తయారు కావల్ల మరి " అన్య ఈడిగి పెద్ద కాజన్న.

" ఆంజినేయ ఏసము కట్టేకి నా పెద్ద కొడుకు రడీ సూడప్పా" అన్య కురువ మల్లయ్య .

" సామీ! డ్రామా నేర్పించే సారే ఎవురెవుర్ని దేనికి పెట్టాలనేది తీర్మానం సేస్తాడు. మనిసి గొంతు , రూపం సూసి ఆసారే సెపుతాడు. మనం అనుకునింది ఆయప్ప ఒప్పుకోడు " అన్య తమ్మల ఎంకటేసు. అట్లే సేయనిల్యా అని అందరూ అనిరి.

"మరి డ్రామా నేర్పించేకి ఎవురిని పిల్సక రావల్ల "అని అడిగ్య ఈడిగ పెద్ద అంజినయ్య .

" పలుకూరు తిమ్మయ్యని పిలిపిద్దాం ల్యాండి " అన్య కురవ గిడ్డయ్య .

"పలుకూరు తిమ్మయ్యకి వొయిసు అయ్యేద్యప్పో! పాలుమారేద్య. ఇప్పుడు యాటికీ రాకుండాడు. ఒక్క రంగాబాయి కి ఒక్కటే హార్మోనీ వాన్చేకి పోతాడంట " అని సమాచారం అందించ్య తమ్మల ఎంకటేసు.

" అన్నీ తెలిసినోడివి ! మరి నీవే సెప్పు ఎవురో ?" అని అడిగ్య బోయ గిడ్డప్ప .

"ఒంటెడుదిన్నెల పాండురంగయ్య అని ఉండాడు. శానా మంచి మనిసి. ఆయప్పని పిల్సకవొద్దాము " అన్య తమ్మల ఎంకటేసు.

" ఎంతడుగుతాడో ఏమో ? " అని అనుమానం పడ్య గొరవ పెద్ద మల్లయ్య.

"మొన్న దయ్యందిన్య జాతరల డ్రామాకి పోయింటి. ఆడ కొంచెం ఇసయం సెవుల పడ్య . రెండు వెయిలు ఇచ్చి దినుమూ ఒకరింట్ల బువ్వ పెట్టేర్యనంట దయ్యందిన్నోల్లు " అని సెప్ప్య తమ్మల ఎంకటేసు.

"మనము గూడా అట్లే ఇద్దాంల్యా మరి " అన్య కల్లమ్మే గిడ్డయ్య .

ఈడిగ అంజినయ్య అందుకొని " సూడప్పా ! డ్రామా అంటే కర్చు ఉంటాది. డ్రామా ఏసినోల్లే బరువు అంతా మోయాలంటే అయ్యేకి లేదు. కాడికి ఇంత ఏసుకుందాము " అని ప్రతిపాదన పెట్ట్య .

“ అవ్వ ! స్టేజీ ఎయ్యాల్ల , కరెంటు వాడుకోనీక్య కరెంటోల్లకి ఇయ్యాల్ల, డ్రామా ఆడేదినుము పోలీసోల్లు బందోబస్తుకి వొస్తారు . వాళ్లకి ఇయ్యాల్ల . అందరు కలిస్తేనే ఘనంగా ఆడొచ్చు “ అని సపోర్టు సేస్య దన్నాడ నాగన్న.

“ సరేల్యా కాడికి నూరు రూపాయలు ఏసుకుందాము “ అన్య ఈడిగి పెద్ద అంజినయ్య.

“ నేర్పించే సారుకి రెండు వేయిలు , ఆయప్పకి బువ్వ పెట్టేది మాత్రం డ్రామా ఎసేవోల్లే సూసుకునల్ల “ అన్య పైగేరి గిడ్డయ్య.

“ మరి రేపు ఎవురు ఫోతారు ఒంటెడుదిన్నెకి పాండురంగయ్యత మాట్లాడేకి ?” అని అడిగ్య ఈడిగ పెద్ద అంజినయ్య .

“ నాను , సిన్న భీమన్న ఫోతాముల్యా “ అన్య తమ్మల ఎంకటేసు.

“ పదయిదు నూర్లకాటి నుంచి ఎత్తుకొని రెండువేలకి సరి చేయండి “ అని సూచన సేస్య కల్లమ్మే గిడ్డయ్య .

“ ఇగా రెండు నూర్లు పాండు రంగయ్యకి సంస్కారం ( అడ్వాన్స్) ఇచ్చి రండి . మీకి చార్జీలకి ఓ యాభై రూపాయలు. మొత్తుము ఇన్నూట యాభై తీసుకోండి” అనుకొంటా జేబులనుండి దుడ్లు తీస్తా “ సూడప్ప మావి మూడు కాడీలు ఉండాయి . ఇంగా యాభై రూపాయలు ఇస్తే సరిపోతాది “ అని లెక్క సెప్ప్య ఈడిగ పెద్ద అంజినయ్య .

అట్లా ఐకరాజ సమితి సమాఏసము మాదిరి గిడ్డయ్య గుడి కట్టమీద కూడా సమాఏసము ముగిస్య . రామాంజి నేయ యుద్ధం డ్రామా ఉరుసుకి ఆడల్లని తీర్మానము సేసి అందరూ బువ్వలు తాగేకి పోయిడిసిరి.

*******

“ అల్వాల్లోళ్లు రాల్యా కదా? నామాట ఇనుకో ! సిన్న మల్లారెడ్డి బాయి పనిల లెక్కలు రాసేదానికి ఎలాబారు . పిల్లోల్లు దసరా సెలవులకి వొస్తారు . పెద్ద పండగ . పిల్లలకి బట్టలు కొనాల. నాకూలి దుడ్లత అయితాదా ? “ అని సద్ది కట్టుకుంటా పాండురంగయ్యని అడుక్కొన్య సుంకమ్మ.

“ నాను యాపనికి పొయ్యేకే లేదు . కళను నమ్ముకొని ఉండాను. ఇయ్యాల గాకఫోతే రేపన్నా ఎవురో ఒకరు వొస్తారు . నన్ని సతాయించొద్దు. నీ పని నీదే , నాపని నాదే “ అని పాండురంగయ్య సుంకమ్మత అంటున్నప్పుడే ...

తమ్మల ఎంకటేసు, ఈడిగ సిన్న భీమన్న ఒంటేడుదిన్నెకి దారి పట్టుకొని వస్తాఉండారు. మోడము మూసుకొని ఉండాది. సద్దులు కట్టుకొని కూలోల్లు సేన్లకి పోతా ఉండారు. తోవలో ఒగరిద్దరూ ఎదురైనోల్లు ఎవురింటికప్పా అని అడుగుతుండారు. ఇద్దరూ అడిగినోల్లకంతా “డ్రామా నేరిపిచ్చే పాండురంగయ్య ఇంటికి “ అని సెబుతుండారు. ఒంటేడుదిన్నె ఊరిమ్యార యాదో గుడి ఉండాది . గుడి ముందర యాపసెట్టు , రాగి సెట్టుకి కట్టిన కట్ట మీద ఐదారుమంది కూసోని ఉండారు. ఇద్దరు

పులికట్ట ఆడతున్నట్లున్నారు. మిగిలినోల్లు వాళ్ళ ఆటని సూస్తా ఉండారు . సంపులే దాన్ని సంపులే అని సూసే వొళ్ళు ఆడేవోల్లకి  సలహాలు ఇస్తాఉండారు.

తమ్మల  ఎంకటేసు ఈనాయండ్లు ఈయాలకే యాదో ఆట పెట్టుకొని ఉండారు, పని సేసుకోకుండా అని మనసులో అనుకొంటా  రోడ్డు మీద నుంచే " యన్నా ! పాండురంగయ్య ఇంటికి ఎట్లా ఫోవల్ల ? " అని అడిగ్య.

అడిగిన ఇసయం  సెప్పకుండా  " యావూరన్నా మీది ? " అని ఒకడు అడిగ్య.

" మాది గువ్వలదొడ్డి , ఏమ్మూరు కాడ " అని సిన్న బీమన్న సెప్ప్య.

" డ్రామా కడుతుండారా ? యా డ్రామా ?" అని ఇంగోడు అడిగ్య.

" రామాంజినేయ యుద్ధం " అని సెప్ప్య తమ్మల ఎంకటేసు .

" రామాంజినేయ యుద్ధం అయితే పాండురంగయ్య  భలే నేర్పిస్తాడుల్యా !" అనుకొంటా " ఇట్లే సక్కగా ఫొండి. కడాన పెద్ధమ్మ గుడి ఉంటాది . గుడికి ఎనకాల ఒకటే కొట్టం ఉంటాది. అదే సూడి " అని సెయి తిప్పుకొంటా సెప్ప్య.

తమ్మల  ఎంకటేసు, ఈడిగ సిన్న భీమన్న పెద్ధమ్మగుడి కల్ల రస్త పట్టిరి . గుడి ఎనక తుక్కు ఫోయిరి. తూర్పుకి మొకమై ఒకే గుడిస ఉండాది. తాటాకు అంతా కిందికి జారి పొయి ఉండాది. గుడిస్య ముందరున్న వారసప్పరం కింద హార్మోని పెట్టె పెట్టుకొని ఉండాడు పాండురంగయ్య. పెట్టెకి  ఏమో రిపేరీ సేస్తున్నట్లుండాడు.

తమ్మల ఎంకటేసు, సిన్న భీమన్న  ఇద్ధరూ వాళ్ళ కొట్టం తుక్కు వచ్చేది సూసి " ఎవురప్పా మీరు ?"  అని కిందికి ఒంగినోడు తల పైకెత్తి అడిగ్య.

" నమస్కారము సారూ ! మాది గువ్వలదొడ్డి . మా ఊరు ఉరుసుకి డ్రామా ఆడాలనుకోనేమ్య. నేర్పించేకి అడిగేకి వొస్తిమి " అనుకుంటా  తమ్మల ఎంకటేసు వారసప్పరం లోకి  వచ్చ్య. పాండురంగయ్య సుంకమ్మని ఇంకా ఫొ నీవు అనేతట్ల సూస్తూ  "ఉరుసు ఎప్పుడు ?" అని అడిగ్య. సుంకమ్మ కాపాడినావప్ప శంకరా అని మనసుల అనుకొంటా కూలికి ఫోయ్యిడిస్య.

" శివరాత్రి ఫోయినంక పద్దైదు దినాలకి  ఉంటాది సారూ !"

"ఇంగా ఏడు నెలలు ఉండాది అయితే "

" అవ్వు సారూ ! ఒగ ఆరు నెలలన్నా  సాదన  ఉంటే బాగుంటాదని పెద్దలు సెబితే ఇట్లా వొస్తిమి "

" అదేమో కరేము (నిజం)  గానీ అలవాలోల్లు అడిగి ఫోయ్యేర్య  గదప్పా. ఎట్లా మరి ?"

" వాళ్ళకి  మాట ఇచ్చేర్యనా సారూ ?"

" వారం అయినంక వొస్తామనింద్రి . ఇంకా రాల్యా "

“ఎన్ని దినాలాయ వారం అయిపోయి “

“పది దినాలు కావస్తా ఉండాది”

“సంస్కారం ఏమైనా ఇచ్చేర్యానా సారూ “

“ ఇయ్యలేదుల్యా గానీ “

“ సంస్కారం ఇయ్యల్యా! వారంల వొస్తాం అన్నోళ్ళు రాల్యా ! ఇంగా వాళ్ళని ఇడిసిపెట్టు సారూ “

“అంతే అంటావా ?”

“ అంతే కాకుంటే మరేమీ ఉండాది సారూ ! మాట సెప్పి పోయినోళ్ళు మాట నిలుపుకునాల కదా “

“సరేల్యా ! యాడ్రామా ఆడాలనుకొంటుండారు ?”

“ రామాంజినేయ యుద్ధం సారూ !”

“ రామాంజినేయ కాదు శ్రీరామాంజనేయ  అనాల ! కాదప్పా మీకీ పేరే పలికేకి రాదు . రేపు నాకి సుక్కలు సూపిస్తారేమో కదప్పా ?”

“ యాదో సారూ సదువు రానోల్లము . మీరే ఓపిక సేసుకొని నేర్పించల్ల”

“ సూడప్పా నాకి పద్యం సెప్పేతప్పుడు తప్పు సెపితే కోపం జాస్తి. తిడుతుంటా, ఇంగా కోపమొస్తే సెలకాలత కొడుతుంటా. ఒర్సుకోవల్ల సూడి “ అని షరతు  పెట్ట్య పాండురంగయ్య .

“ గురువు లేని విద్దె గుడ్డి విద్దె అంటారు . గురువన్నంక తిడతాడు , కొడతాడు . మావోల్లు అట్లా అనుకునేకి లేరుల్యా సారూ ! మీరే సూస్తారు కదా “

“ మరి నా కథ ఎట్లా ?”

“ ఊరి పెద్ద మనుసులు పద్దైదు నూర్లిచ్చి దినుమూ బువ్వ పెడదాముల్యా అని తీర్మానము సేసినారు సారూ “

“ పద్దైదు నూర్లంటే ఎట్లప్పా ? ఊరిడిసి , పెండ్లాం పిల్లల్ని ఇడిసి వొస్తాను . మరీ పద్దైదు నూర్లంటే ఎట్లా “ కొంచెం దీనంగా అడిగ్య పాండురంగయ్య.

“ నీ దగ్గర దాసిపెట్టేది ఏముండాది ! ఉర్ల రెండు వేయిలు అని ఖరారు సేసిండారు. రెండువేలకి ఎట్లన్నాగాని ఒప్పుకో సారూ  “ అని ప్రాదేయపడిరి.

“ సరేల్యాప్పా ! ఉర్ల పెద్దమనుసులు తీర్మానం సేసేర్య అంటుండారు కదా . అట్లే కానిల్యా . డ్రామా నాడు మాత్రం నాకి నా పెండ్లాంకి బట్టలు పెట్టల్ల సూడు  “

“ మాకేమి తెలదా ! ఎవ్వరైనా గానీ డ్రామా నాడు బట్టలు పెడతారు . దానికి తక్కువ సేయ్యంల్యా సారూ “

“ వచ్చే బేస్తవారము దశమి అయితాది. మంచి దినుము . ఆపొద్దు పూజ పెట్టుకుందాము “ అని ఖరారు సేస్య పాండురంగయ్య.

“ అట్లే కానీల్యా సారూ ! ఇద్గో ఈ రెండు నూర్లు సంస్కారం ఇయ్యమనేర్య . తీసుకో “

“ హర్మోనికి మొక్కి దాని మీద పెట్టండి “ అన్య. తమ్మల ఎంకటేసు పెట్టెకి మొక్కి దాని మీద పెట్ట్య.

“ మామోస్తాము సారూ “

“ బువ్వ తిని ఫోదురు. వొండింది ఉండాది ” అని అడిగ్య పాండురంగయ్య .

“ ఈ సంచిల సద్ది ఉండాది. ఇంగా యాల కాల్యా గదా ! రోడ్డు మీదికి ఫోయినంక ఆడ తిని ఫోతాము” అన్య సిన్న బీమన్న .

“ తెచ్చుకోనింటే యదారు లేదుల్యా . ఎట్లా మరి బేస్తవారము ఫొద్దున బండి కొట్టుకొని వొస్తారా ? ఏంటికంటే హర్మోని పెట్టె ఉంటాది కదా ?” అని అడిగ్య పాండురంగయ్య.

“ అట్లే సేస్తాము. మీరు ఇంగేవూరికీ మాట ఇయ్యోద్ధండిసారూ “ అన్య తమ్మల ఎంకటేసు.

******

శ్రావణ శుద్ధ బహుళ దశమి బేస్తవారం డ్రామా నేర్సుకొనేకి మొదులుపెట్టే పూజకి అందరూ తయారు అయ్యిరి . పాండురంగయ్య ఎద్దులబండి మీద హర్మోని పెట్టేసుకొని వొచ్చ్య . ఈడిగి పెద్ద అంజినయ్యోల్ల కొత్తిల్లు ఆయప్పకి ఇచ్చిరి . ఇంటి తల వాకిలికి రెండుతుక్కులా కట్టలు ఉండ్య. తూర్పు ముఖము సేసి కూసోవల్లని బువ్వసేయిపక్క కట్టని పాండురంగయ్య ఎన్నుకున్య .మాపుసారి ఆరు గంటలకి పూజ అనిరి. ఊరి పెద్దలు, డ్రామా కట్టాలనే కాయాస ఉన్నోళ్ళు , కట్టాలని కాయాస ఉన్నా దుడ్లు లేక కట్టలేక పోయినోళ్ళు , బాపనయ్య స్వామీ అందరూ వొచ్చిరి. పాండురంగయ్య హర్మోని పెట్టెకి బొట్లు పెట్టి, పూలదండ యేసి ఊదికడ్డీలు తిప్ప్య. పంచి కజ్జాయం పెట్టె మీద సల్ల్య . ఊదికడ్డి పొగకి టెంకాయ సూపిచ్చి రెండు ఒప్పులు అయ్యేతట్ల కొట్ట్య . కొబ్బెరి సిప్ప మీద కర్పూరం పెట్టి హర్మోని పెట్టెకి హారతి తిప్పబట్ట్య.

స్వామి “**ఓం సర్వ మంగళ మాంగల్యే శివే సర్వార్థ సాధకే శరణ్యే త్రయంబకే దేవి నారాయణే నమోస్తుతే!** “ అని శ్లోకం సదివ్య.

ఈడిగ చిన్న కాజన్న “ నమో పార్వతి పతిహర హర మహాదేవ్ “ అన్య.

అందరూ శ్రీరామ చంద్రునికీ జై, గిడ్డయ్య సామికీ జై, ఈస్పురునికీ జై, పెద్దమ్మవ్వకీ జై, కాసిమప్ప తాతకీ జై, గంజిల్ల బడిసావప్పకీ జై అని మిద్దె మన్ను రాలేటట్ల అరిసిరి . అందరకీ హారతి ఇచ్చ్య పాండురంగయ్య . వొచ్చినోల్లు ఒక రూపాయి కాడి నుంచి ఐదు రూపాయల వరకి హర్మోని పెట్టి మీద దచ్చిన పెట్టిరి.

పాండురంగయ్య పెట్టి ముందు కూసోని కండ్లు మూసుకొని " పర బ్రహ్మ పరమేశ్వర . పురుశోత్తమ సదానంద " అని హార్మోని వాయిన్చుకొంటా పాట ఎత్తుకున్య.

పాట అయిపోయినంక "ల్యాండప్పా! మనకి పన్నెండు మంది కావల్ల . ఎవురెవురు డ్రామా కడతారు ముందుకు వొచ్చి కూసొండి "అన్య పాండురంగయ్య.

ఎంచుకొనే ఇసయంల పాండు రంగయ్యకు సుక్కలు సూపించిరి కాబోయే శిష్యులు . 'పక్షపాతి' అనమంటే 'పచ్చపాతి 'అనీ, 'బ్రహ్మర్షి' అనమంటే 'బమ్మర్సి'అనీ, 'వ్యాసంగం' అనమంటే 'యాసంగం' అని ఒక్కొక్కడు ఒక్కో అవతారము పడిరి . సూసేవొల్లు పడి పడి నగిరి. అందరికన్నా బాస గానీ, రాగం గానీ బాగా అందుకున్నోడు రసూలు సాయిబు.

"" ధర్మము ధర్మమంచును వితండ వితర్కములాడేదేల" పద్యాన్ని రసూలుసాబు ఒక్క సారి ఇని సెప్పిన ఎంబడినే పాండురంగయ్య నుగ్గ మెచ్చుకొని రాముని ఏసము ఇచ్చ్య . తరవాత బాగా సెప్పినోడు దత్తప్ప. ఆయప్పకి నారదుని ఏసము ఇచ్చ్య. పాండు రంగయ్య అందర్నీ పరీచ్చించి పన్నెండు మంది జాతిరత్నాలని ఇట్లా ఎన్నుకున్య.

శ్రీ రాముడు – రసూల్ సాబ్ ; ఆంజినేయుడు – వడ్ల దేవేంద్ర ; యయాతి – వడ్డే వెంకటప్ప

నారదుడు – దత్తప్ప; వసిష్టుడు – తంబల వెంకటేసు; విశ్వామిత్రుడు - గొరవ నాగన్న

లక్ష్మణుడు – ఈడిగి రామాంజి; భరతుడు – బారికి వెంకటేసు; శత్రుఘ్నుడు : నేసె సీను గాడు

సుగ్రీవ – బోయ గిడ్డయ్య; అంగద – తురక రెడ్డి; జాంబవంత – మాదిగి బజారి ;

"వడ్డే ఎంకటప్ప గాడు కొట్టేరా చాన్సు" అనిరి అందురూ ! ఏంటికి అంటే శాంతిమతి ఏషం రంగాబాయిఏస్తాది గదా ! యయాతి భార్య ఆయమ్మే కాబట్టి .

"మా వడ్డే వెంకటప్ప గానికి మాంచి పాట పెట్టు సారూ" అని ఎవురో గుంపులనుంచి కువ్వాడం సేసుకుంటా అడిగిరి.

" అయినదేమో అయినదీ ప్రియ గానమేదే ప్రేయసీ " పెడదాంల్యా అన్య పాండు రంగయ్య .

ఎర్రి ఎంకటప్పగాడు ముసిముసి నగువులు నగ్య. ఆప్రకారంబుగా పూజాది కార్యక్రమములు ముగిసి పాత్రధారుల ఎంపిక ముగిసె. పాపం పాండు రంగయ్యకి తెల్దు ముందుండాది ముసల్ల పండగ అని. పాండు రంగయ్యని ఈడిగ పెద్ద అంజినయ్య బువ్వ తాగేకి పిలిస్య. ఈఎర్రి నాగన్నలని పట్టుకొని పద్యాలు , మాటలు నేర్పిచ్చేకంతా తల ప్రాణం తోకకి వొస్తాదని పాండురంగయ్యకి తెల్దు పాపం.

**********

ఈడిగ అజినయ్య కొత్తింటి కట్ట డ్రామా పద్యాల సాదనకి నిలయమాయ . మాపుసారి ఆరు గంటలు అయ్యేదే సాలు, డ్రామా కట్టేనోల్లు, కట్టనోల్లు , కువ్వాడం సేద్దామనుకున్నోల్లు అందరూ వొస్తుండిరి. ఒగ్యాల గోడలు పద్యాలు నేర్సుకొనేతట్ల ఉంటే ఈయప్పోల్లకన్న ముందు గోడలే నేర్సుకొంటుండ్యనెమో !

యయాతి ఏసం కట్టిన వడ్డే వెంకటప్ప " తాపసేంద్రా " అనమంటే " తపసేంద్రా " అనబట్య.

" యలే! రంగాబాయి పక్కన నువ్వు ఆడేది . తొస్యకూతలు కూస్తే ఆయమ్మ ఎడమకాలుత తంతాది సూడి " అని పాండురంగయ్య హెచ్చరిస్తుండ్య.

విశ్వామిత్రుని ఏసం కట్టిన గొర్వ నాగన్న " యయాతీ ! వశిష్ఠ పక్షపాతి " అనమంటే " ఏఏతీ ! వొసిస్ట పచ్చపాతి " అన్య.

" ఈడిసిన్నాబట్ట ! ఈనికి పలికేకే రాదు. ఈని నాలికకి సింతోక్కు ఏసీ తోమల్ల సూడి " అన్య గొర్వ నాగన్నకి అత్త వరసైన దన్నాడ అనుమంతమ్మ.

" పచ్చపాతి , నీలంపాతి కాదలే! పక్షపాతి అనల్ల " అని పాండురంగయ్య తలకాయ కొట్టుకోనేకి మొదులు పెట్ట్య .

అంగదుని ఏసము కట్టిన తురక రెడ్డి " నర వానర యుద్ధము ఇక తథ్యము, తథ్యము సిద్ధంబుగా ఉండుడు " అనమంటే " నర నరాన యుద్ధము ఇంగ తద్దెము, తద్దెము , సిద్దా ఉండు " అని అంటా ఉండ్య.

" యాడ నుండి మూలమైనావురా నా ప్రాణానికి" అని పాండురంగయ్య లబ లబ నోరు కొట్టుకున్య.

నారదుని ఏసం కట్టిన దత్తప్ప సామి పదో తరగతి సదువుతుండ్య కాబట్టి బుక్కు కొనుక్కొని ఇంటికాడ నేర్సుకొంటా ఉండ్యా. పది పరీచ్చ బుక్కులు పక్కన పడేసి రామాంజినేయ యుద్ధం బుక్కు సదవబట్ట్య. వాల్లమ్మేమో పదోతరగతి ఆటకెక్కిస్తాడేమో అని అనుమానం పడుకుంటా సదివే పిలగాడిత డ్రామా కట్టిచ్చ్య ఈయప్ప అనుకొంటా బాపనయ్య స్వామిని తిట్టుకుంటా ఉంటాండ్య. దత్తప్ప మాత్రం వాళ్ళమ్మ అనుమానాన్ని నిజం సేసేంతవరకీ నిద్ర పోల్యా !.

యామాటకి ఆమాట సెప్పల్ల ! ఒక రసూలు సాబు మటుక్కి అచ్చరం పొల్లు ఫోకుండా సేబుతుండ్య . రాగానికి రాగం , మాటకి మాట బలే సేబుతుండ్య . ఇంగా ఏమంటే రసూలు సాబు డ్రామా మొదులు పెట్టినప్పటి నుంచి నీసు తినేది ఇడిసిపెట్ట్య. కడాకి కోడిగుడ్డు కూడా ముట్టుత ల్యాకుండ్య . కొడుకుకి ఒడుగు సేసినా నీసుని ఇట్లా ముట్టుకోల్యా ! దేవుని ఏసం కట్టేన్య , తింటే ఎట్లిప్పా అన్య .రసూలు సాబు భక్తికి ఉరూరే అచ్చర్యపోయా.

ఆంజనేయ ఏసం కట్టినోడు వడ్ల దేవేంద్ర కదా ! ఈడు అతినాకొడుకు . ఈని శాష్టలకి అంజినేయుని ఏసానికి సరిపోయేద్య అనిరి అందరూ . ఊరూరికే ఎగిరేది , పై గీరుకోనేది , కొండ్లు మూసుకొని రామా! రామా! అనేది ఒకటి కాదుల్యా వాని ఏసాలు .

గిడ్డయ్య సామి గుడిల పున్నము నాడు భజన జరుగుతా ఉండ్య. గుడిల మైకు ఉండ్య . ఈయప్పోల్లందరూ పాండురంగయ్యను పట్టుకొని హార్మోనీ పెట్టి తీసుకొని గుడికాడికి పోతుంద్రి . రేతిరి పదిగంటలకి భజన అయిపోతా ఉండ్య . అప్పుడు ఈయప్పోల్లు నేర్సుకున్నపద్యాల్ని గుడి కట్ట మీద మైకుల అలవాటు కావల్ల అని సేప్పుతుంద్రి. గుడిల మైకు పెట్టె మిషను లచ్చుమన్నకి గణేశు బీడీలకట్ట , అగ్గిపెట్టే ఇప్పిస్తుండిరి. ఊర్ల మంది పున్నమంటేనే బెదురుకొనేతట్ల ఆయ ఈయప్పొల్ల రాగాలు మైకుల ఇనల్యాక . పున్నమనాడు ఈయప్పోల్లు ఇంటోల్లని సూసేకి గుడి కట్టకాటికి

పిల్సుకుంటా ఉండిరి. పెండ్లి కాని పిల్లోల్లు వాళ్ళు మనసున్న ఆడపిల్లోల్లని రమ్మని అడుక్కొంటా ఉండిరి. ఆయమ్మోల్లని సూసి ఈనాయండ్ల సేసే వొగులు సేప్పనీక్య లేదుల్యా. పాండురంగయ్యకి ముందే ఒప్పందం సేసుకొంటా ఉండ్రి.

" సారూ మా ఇంటోల్ల ముందు అట్లా అనరాదులే , ఇట్లా అనరాదులే అనొద్దు . నేసె నేట్టేకల్లప్ప హెూటళ్ళ ఒగ్గాని పుగ్యాలు తినిపిస్తాం . ఆయిత్వారంనాడు కోడి కూర పెట్టిస్తాం " అని ఒప్పందం సేసుకొంటా ఉండ్రి .

ఊరిడిసిన పాండురంగయ్యకి ఈ ఒప్పందం శానా నచ్చుతుండ్య. ఇంగో అడుగు ముందుకేసి "సెబాస్ రా ! ఏం సేప్పితివిరా "అని మునగ సెట్టు ఎక్కిస్తాఉండ్య .

ఒక పున్నమనాడు వొడ్ల దేవెంద్రగాడు మనసు పడిన పిల్ల సూసేకి వోచ్చిండ్య. ఇంగ సూడు వాని ఇకారము శాస్త్రాలు!

" రామ నీల మేఘ శ్యామ కోదండ రామ,
రఘుకులాబ్ధి సోమ పరందామా సార్వభౌమా!
నీల మేఘ శ్యామ!
జయ రామ్ రామ్ రామ్ ,రఘు రామ్ రామ్ రామ్
జయ రామ్ రామ్ రామ్, రఘు రామ్ రామ్ రామ్ "

అని పాట పాడతా పైనిండినోని మాదిరి రామ రామ! రామ రామ! అనుకొంటా కండ్లు మూసుకొని రెండు సేతులత మొక్కుకొంటా ఊగిపోయా. దేవుడు పైలోకి వొచ్చిండాడు , ఊదికడ్డీలు పట్టేయండి అని ఒకాయమ్మ , కాళ్ళకి మొక్కండి అని ఒకాయప్ప , నిండు గడవ నీళ్ళు తీసుకొచ్చి కాళ్ళకి పోయండని ఒకాయమ్మ అనేకి మొదులు పెట్టిరి . దేవేంద్ర గానిలో అందురూ ఆంజినేయ సామిని సూసుకొనిరి. దేవేంద్ర గాని అవతారాలు అన్నీ తెలిసిన పాండురంగయ్య కూడా జీవించడం ప్రారంబించ్య. అందరూ దేవేంద్ర గాన్ని సుట్టుకోనేతాలకి రసూలు సాబు కూడా కండ్లు మూసుకొని రెండు సేతులత మొక్కతా "ఆంజినేయ! ఆంజినేయ! అనేది మొదలు పెట్ట్య.

పాండురంగయ్య రసూలు గాని దగ్గరకి పొయి సెవుల సిన్నగా " యాలే ! యాడన్నా రామునికి అంజినేయుడు పై లోకి వొస్తాడా ? నాకి బుద్ధి లేదని అంటారులే . ఊకుండులే ! మర్యాద తీయొద్దు" అన్య.

" ఏంటికి అంజినేయుడు కూడా దేవుడే కదా ? పై లోకి ఏంటికి రాడు " అని ఒక కన్ను తెరిసి లా పాయింటు తీస్య రసూలు సాబు .

" యప్పా ! నీకు మొక్కుతాను తండ్రీ . రవ్వంత సేపు ఊరక ఉండు, రాముని భక్తుడు ఆంజనేయుడు. ఎవురి పైలోకైనా వొస్తాడేమో గాని రాముని పై లోకి మాత్రం రాడురా" అన్య.

"అట్లనా ! సర్ల్యా " అన్య రసూలు సాబు . పాండురంగయ్య బతికినానురా దేవుడా అనుకున్య.

డ్రామా కట్టేకి ఎగితి లేని ,కాయాస ఉన్న పిలగాల్లు దినుమూ సాదన సూసేకి వొస్తుండిరి. సూసే పిల్లలే డ్రామా ఎసినోల్లకన్న బాగా పద్యాలు సెప్పుతా ఉండిరి. ఆ ఆరు నెలలు గువ్వలదొడ్డిల యాపనికాడ సూసినా పద్యాలు పాడేవొల్లె. సెక్క పని సేసే వొడ్ల ఆచారి కూడా బాడిస్యత నాగేలి సేక్కేతప్పుడు " ఆడిన మాట తప్పుట మహా ఘనముగాదె " అని పాడుతా పని సేస్తా ఉండ్య .

కలుపులు తీసే ఆడోల్లు " అయినదేమో అయినది ప్రియా " అనే పాట ఎత్తుకొంటాఉండిరి. ఇస్కూలు పిలగాళ్ళు " ఔను స్వామీ ! మాజాతి కొత్తదా? ఈ కోతి మీకు పరాయిదా?" అని సెప్పి నుగ్గ నగుతుంౘ్రి. పసులు గాసే బుడ్డన్న గాడు " కుసలంబేగదా ఆంజినేయ " అని పద్యం పాడుకుంటా పసులు బారికి మద్దిలేటి సేన్ల పోయింది సూసుకోకుండా తొన్నులు తిన్య. ఎవురన్నా " ఫోయోస్తాం మామా అంటే " " శుభ ప్రాప్తిరస్తు అంగదా " అనబట్టిరి . మొత్తానికి ఉరూరే రామాంజినేయయుద్ధంల మునిగిపోయా.

పాండురంగయ్య వైభోగమే వైభోగము. దినాము ఒక శిష్యుని ఇంట్ల తినేది. ఆయిత్వారం , మంగళారం తునకల బువ్వ గ్యారంటీ . పున్నమునాడు గుడికట్టకాడ ఆడోళ్ళముందర మెచ్చుకొంటాడని ఇంటికొచ్చినప్పుడు పాండురంగయ్యకి శానా బాగా సూసుకొంటా ఉండిరి . ఇసయం గ్రహించిన పాండురంగయ్య కూడా వాళ్ళ ఆటకి తాళం కొడతాఉండ్య.

ఎవుర్నన్నా పద్యం సేప్పేటప్పుడు అది తప్పురా అంటే "నాను ఏమిసెప్పినా తప్పేల్యా సారూ! ఆయప్పొల్ల మాదిరి తునకల బువ్వ పెట్టల్యా కదా ? నానూ రేపు అయిత్వారం పెడతానుల్యాప్పా ! ఎంటికట్ల సేస్తావు? " అని అంటుంౘ్రి.

" ఏంటికి అట్లానుకొంటారలే! నాకి అందురూ ఒకటే, గురువుకి బాగా పాడేవోళ్ళ మీద ప్రేమ ఉంటాది గాని, కూర తినిపిచ్చే వోళ్ళ మీద కాదు " అని అంటా ఉండ్య పాండురంగయ్య.

*******

డ్రామా అడేకి ఇంకా నెల దినాలు ఉండాదనంగా పాండురంగయ్య " నాను కర్నూలుకి పొయి రంగాబాయిత మాట్లాడి ఎంతోకొంత సంస్కారం ఇచ్చిరావల్ల . నామాటేమీ కాదనదు. అట్లని ఈడే ఉంటే పని అయ్యేకిలేదు. దినాలు దగ్గర పడుతుండాయి మరి . ఆయమ్మ ఎవురికన్నా మాటిస్తే తిప్పలు అయితాది సూడండి" అన్య .

ఆయమ్మకి సంస్కారం ఇచ్చేకి నూరు రూపాయలు , పాండురంగయ్య చార్జీకి , ఖర్చులకి ఒగ నూరు రూపాయలు ఇచ్చిరి.

" నువ్వు ఆయమ్మని ఎట్లైనా ఒప్పించి పిలసకరావల్ల సూడి సారూ! మరి ఎవుర్నంటే వాళ్ళనే పిలుసుకొని వొచ్చేవు . ఎవురూ ఒప్పుకోరు సూడి " అని రంగాబాయిత డ్యాన్సు ఎయ్యాలని కాయాసున్న వడ్డే ఎంకటప్ప గట్టిగా సెప్ప్య .

పొద్దున్నే పాండురంగయ్య జుబ్బా పైజామా ఏసుకొని పెండ్లికొడుకులక్క తయారుఅయ్యి రంగాబాయికాటికి బయలుదేర్య . రెండు దినాలు అని పోయిన పాండురంగయ్య నాలుగు దినాలు అయినా రాల్యా . వడ్డే వెంకటప్పకి రంగాబాయి ఒప్పుకోనేదేనో లేదో అని తెలియక రెండు దినాలనుంచి నిద్ర పట్టల్యా!. పాండురంగయ్య ఐదో దినము వచ్య.

గోడ కడుతున్న వడ్డే వెంకటప్ప ఉరుక్కుంటా వచ్చి "ఏమాయ సారూ ? ఆయమ్మ వొచ్చేకి ఒప్పుకున్యా ? " అని ఆత్రుతత అడిగ్య .

పాండురంగయ్య మీసం తిప్పుకుంటా “ మనం అడిగినంక కాదంటాద్యారా? నాను తిరుపతి పొయ్యేది ఉండాది రాను అన్నా ఒప్పిస్తి ఏమనుకున్నావ్ . వచ్చినాయమ్మని మర్యాదగా సూసుకోవల్ల సూడిరా “ అన్య.

“ ఈడిగి అంజినయ్యోల్లది పెద్దిల్లు కదా ! ఆడ దిగుతాది. బువ్వ గివ్వ ఏర్పాట్లు నాను సూసుకుంటాను. ఎవురికీ మాటియ్యొద్దు సారూ “ అని వడ్డే ఎంకటప్ప గుసగుసగా పాండు రంగయ్యకి సెప్ప్య .

“ ఏమిరా నన్ని సూసుకోవా ?” అని పాండు రంగయ్య కువ్వాడమాడ్య.

“ నిన్ని అందరూ సూసుకుంటారు సారూ ! ఆయమ్మని నాను సూసుకునాల కదా! “ అని గారపండ్లు కనపడేతట్ల ఇకిలించ్య.

*********

డ్రామా నేర్సుకోనేది అంతా అయిపాయ. గిడ్డయ్య గుడి కట్టమీద మైకు పెట్టుకొని పున్నము నాడు మొత్తము ఆడేకి తయారయిరి. రాత్రి గిడ్డయ్య గుడి కట్ట కాడికి డ్రామా అడేవోల్లు, ఊరి పెద్దమనుసులు , సూసేవొల్లు అందురూ వొచ్చిరి. రాముని ఏసం కట్టిన రసూలు సాబు పద్యం సెప్పేది ఇని అందరూ సీలలు ఏసిరి.

సూడనీక వొచ్చిన సాదువు ఒగాయప్ప “రాముడికి గడ్డం ఉండదు కదా ? మరి ఈయప్పకి గడ్డం ఉండాది. ఎట్లా ? “ అని అనుమానము లేవదీస్య.

“ తాతా ఇది దేవుని గడ్డం . తీసేకి లేను. “ అన్య రసూలు సాయిబు.

“ రే రసూలా ! సాదువు సేప్పింది నిజమేలే ! డ్రామా నాడు గడ్డం తియ్యల్ల “ అన్య పాండురంగయ్య .

” సార్ ! నాను డ్రామైనా ఇడిసి పెడతాను గాని గడ్డం మాత్రం తీయను సూడి “ అన్య.

“ తీయిరా ఏమైతాది? మలి పెంచుకుందు వుల్యా “ అని నచ్చసెప్పేకి సూస్య.

“ దేవుని గడ్డం సారూ . ఎట్లా తీస్తావు ? “ అన్య రసూలు సాబు .

సూడనీక్య వొచ్చినోల్లంతా ఒక్కొక్కరు ఒక్కొక్క మాట మాట్లాడిరి. తమ్మల ఎంకటేసు “ ఈతకాయలు తినిన నక్కల్లక్క ఏంటికి అరుస్తారు. కొంచెపు సేపు ఊరక ఉండండి. పెద్దమనుసులు ఉండారు కదా వాళ్ళు ఏమంటారో సూద్దాం” అని అన్య.

పెద్దమల్లయ్య “ రసూలుగాడు శానా నిష్టగా డ్రామా నేర్సుకొనేడ్య. ఏడు నెలల సంది ఒక్కదినుము కూడా నీసు ముట్టల్యా. కడాకి గుడ్డు కూడా తినల్యా. దేవుని ఏసం కట్టేన్య తింటే ఎట్లా అంటుండ్యనంట. కొడుకు ఒడుగు అయితే కూడా నీసు ముట్టలేదంటా. యా దేవుడైనా దేవుడే గదా! మనము నిష్టగా ఉండల్ల అంటుండ్యనంట. మరి ఆయప్ప మన దేవునికి అంత భక్తి సూపిచ్చినప్పుడు మనం గూడా ఆయప్ప దేవునికి అంతే భక్తి సూపల్ల కదా “ అన్య.

“ రసూలు సాబు పద్యం  సెబితే ఆ సీరాముడే సేప్పినట్లుఉంటాది. రామునేసానికి రసూలే తగినోడు “ అని బోయ దుబ్బమ్మ అన్య.

“ రామునికి గడ్డం ఉండల్ల అని లేదు. లేకుండల్ల అని లేదు “ అన్య బాపనయ్య సామి.

దరేసాబు “ సూడిరా రసూలు! ఇంగోసారి ఆలోసన సెయ్యి “ అన్య.

కల్లమ్మే గిడ్డయ్య “ దరేసా ! వాడ్ని ఏమీ అనొద్దు . ఆలోసన సేయాల్సింది రసూలు గాడు కాదు, మనం.  పెద్ద మల్లయ్య సేప్పిందే నిజం .” అని దరేసామీద కోపం పడ్య.

అందరూ రసూలు సాయిబే రాముని ఏసం ఎయ్యల్లనీ , గడ్డం అడ్డం ఎమీకాదనీ తీర్మానం సేసిరి.

ఎవుడో గుంపులోన్నుంచి “ గడ్డం రాముడులే “ అన్య . అందరూ నొగిరి

*******

డ్రామా ఆడే దినుము వచ్చిడిస్య . ఊరంతా సంబరమే . కులము, మతము , స్థోమతతో సంబంధం లేకుండా అందరూ ఇండ్లు అలుక్కొనిరి. ఆడపిల్లలు పోటీలు పడి స్టేజి ముందర ముగ్గులు ఏసిరి.  దరేసాబు బిడ్డ ఫాతిమా ఏసిన ముగ్గుని ఊరూరే మెచ్చుకున్య . స్టేజీ ఎసేవోల్లు స్టేజీ ఏసిరి. మామిడాకు కట్టేవోల్లు మామిడాకు కట్టిరి . డ్రస్సు కంపెనీ వొళ్ళు వొచ్చి తెరలు కట్టేకి మొదులు పెట్టిరి. కరెంటోల్లు లైట్లు ఏసిరి. మైకోల్లు మైకు పెట్టిరి. గోనెగండ్ల నుంచి నేసె గౌరన్న ఫోటోలు తీసేకి వచ్చ్య. మాపుసారి ఐదు గంటలకి ఎద్దులబండి మీద రంగాబాయి వోచ్చ్య. నల్ల కండ్లద్దాలు పెట్టుకొనింద్య. వాణిశ్రీ కొప్పు కట్టుకొని దాని సుట్టూ పూలు సుట్టింద్య.  వడ్డే ఎంకటప్ప బండిని సక్కగా ఈడిగ అంజినయ్య ఇంటికాటికి  తోలుక పోయా. సగం ఊరు ఆబండి ఏనాకాలే ఉంద్య . అయమ్మతో హార్మోనిస్టు, హార్మోని పెట్ట్య వచ్చ్య. రంగాబాయి బండిదిగి పడసాల కట్టమీద ఏసిన కంబడి పైన కూసున్య. ఊరంతా సూసేకి ఒచ్చేర్య అని లోపల్లోపల సంతోస పడ్య.  కర్నూల్ల  గేరిలోన కొలాయికాడ యాయమ్మ కూడా ఒక కడవ వొంతుతో సంబంధం లేకుండా నీళ్ళు పట్టుకో రంగాబాయి అనరు. తాను గొప్ప నటి అని కళా పోసన తెలీని అవితికి ఏమి తెలుసు నా గొప్పదనము అనుకున్య. జానిజానికి సెయ్యిరుమాలు తీసుకొని ముఖము తూడ్సుకుంటుంద్య.

స్టేజి ముందర తార్పాల్లు, సాపలు , జంపఖానాలు పరిసి జాగాను ముందే పట్టుకొనిరి . పాండురంగయ్య పెండ్లాము కూడా వచ్చ్య . సారుకీ అమ్మయ్యకీ స్టేజీ మీదనే  కొత్త బట్టలు పెట్టిరి. నూట పదార్లు దచ్చిన పెట్టిరి.  పాండురంగయ్య వాళ్ళు పెట్టిన బట్టలు కట్టుకొనే హార్మోని వాంచేకి వచ్చ్య. ఎనిమిది గంట్లనుంచి పది నిమిసాల్ల డ్రామా ప్రారంబం అయితాదని మైకుల సెప్పబట్టిరి. జల్ది బువ్వ పెట్టమని ఇండ్లల్ల పిల్లలు మంకు సేసిరి.

“ఆయప్పొల్ల ఉద్ధర మాటలు ల్యావర్యా . మొదులు అయ్యేకి కనిష్టం పదకొండు అయితాది. ఏంటికి తుర్తు పడతారు” అని అమ్మోల్లు పిల్లల్ని కసిరిచ్చుకొనిరి.

నేసె నెట్టేకల్లప్ప ఉగ్గాని, టీ సేసేకి తయారయ్య . డ్రామా కట్టినోల్లు వాళ్ళ బందుబలగాన్ని పిలుసుకొనిండిరి. అనుమేసప్ప సామి అందరూ సూడల్లని రామాంజినేయయుద్ధం బుక్కు సంకల

పెట్టుకొని స్టేజి ఎక్కేది దిగేది సేస్తాండ్య. సంకల బుక్కు ఏంటికంటే ఎవురన్న పద్యాలు , మాటలు మరిసిపోతే పరదా ఎనక నుండి అందిచ్చేకి అన్నమాట. పన్నెండు మంది డ్రామా కట్టినోల్లు, రంగాబాయి స్టేజి ఎనకాల రొంగు  ఏయించుకొనేకి రడీ అయ్యిరి. రంగాబాయి తన తానె రొంగు ఏసుకున్య.

మిగిలినోళ్ళకికి రొంగు అంటించేకి ఏమ్మనూరు నుంచి వొచ్చిన కుంకునూరు రంగప్ప  " ఆ రాండప్పా ! రాముడెవురు?ఇట్లా నాముందు వొచ్చి కూసోండి" అన్య. రసూలు సాయిబు వొచ్చి కూసొన్య .

రంగప్ప రసూలు సాయిబు ను సూసి " జల్దీ  ఆగడ్డం కొరుక్కొని రాపో ! " అన్య.

"  కొరిగిచ్చేకి లేను . ఇది దేవుని గడ్డం. మా ఊర్ల పంచాయితీ గూడ జరిగ్య. ఊరే తీర్మానం సేసిండాది గడ్డం తోనే ఏసం ఎయ్యల్లని "  అన్య.

" నాకి అదంతా తెల్దు. ముందు పాండురంగయ్యని పిలిపిచ్చండి" అన్య పాలుకూరు రంగప్ప.

ఇసయం ఇన్న పాండురంగయ్య "రసూలు సాయిబుకు గడ్డం తో నే రంగు ఎయ్యి , ఇది ఊరి తీర్మానం" అన్య .

పాండురంగయ్య హార్మోనీ మీద   " పర బ్రహ్మ పరమేశ్వర . పురుషోత్తమ సదానంద " అని వాంచేటప్పటికి అందరూ తెర ఎనకాల వచ్చి ప్రార్థన పాట మొదులు పెట్టిరి. వశిష్టుడు ఏసం కట్టిన తమ్మల ఎంకటేసుకు కుంకునూరు రంగప్ప తెల్ల గడ్డం పెట్టనీక పొతే తెల్ల గడ్డం వొద్దె వొద్దన్య.

" విశ్వామిత్రునికి నల్ల గడ్డమంట నాకేమో తెల్లగడ్డమంట? గొరవ నాగన్న గాడు నాకన్నా ఆరెండ్లు పెద్ద. ఏం నన్ని ముసిలినా కొడుకుని  అనుకొంటివా? ఆ తెల్ల గడ్డాన్ని సూస్తే  నా పెండ్లాం తిడతాదప్పో. ఆయమ్మ నన్ని కొంచమన్న అరువుండాద్యా? అంటే నాను తలకాయి యాడపెట్టుకునల్ల?  కడితే నల్లది కట్టు ల్యాకుంటే గడ్డమే వొద్దు"  అన్య.

రంగప్ప " ఈ గువ్వలదొడ్డి నాయండ్లు ఉత్త యడ్డనాకొడుకులు సూడి!" అని నొగుకుంటా ఎంకటేసుకు కూడా నల్ల గడ్డం కట్య.

అందరూ డ్రామా ఎప్పుడు మొదులు  అయితాదా? అని సూడబట్టిరి. జాగలు పట్టుకున్నోల్లు జాగలు ఇడిసిరి . తెర లేస్తుండగానే నారదుని ఏసం కట్టిన దత్తప్ప " నేడు గదా రామ రాజ్యమున శాంతిమయ వసుధైక ప్రభుత్వం స్థాపించబడినది " అని  ఎత్తుకున్య . భయం గియం లేకుండా అదర గొట్టేటట్ల నారదుడు సేప్పతా ఉంటే  అందరూ ఈలలు, సప్పట్లు , కేకలు ఏయబట్టిరి. డ్రామా ఇంగా కచ్చితంగా పాసు అయితాదిరా అనుకొన్రి. అన్నీ ఆటంకాలను దాటుకొని డ్రామా మొదులు అయినందుకు ఆనందంత పాండు రంగయ్య కళ్ళళ్ళ నీళ్ళు వచ్చిడిస్య .

వడ్డే వెంకటప్ప రంగాబాయిత " అయినదేమో అయినదీ ప్రియ " అనే పాటకి డ్యాన్సు ఏస్తుంటే, ఆయమ్మ సెయ్యి పట్టుకొని గిర్రన తిప్పితే " అయ్యిలే కొడకా " అని ఈలలు , కేకలు పెట్టిరి .

భరతుని ఏసం కట్టిన బారికి ఎంకటేసు " ఎందుకీ వానర సంఘనాశనం ? అని అనుకొంటా " ధైర్యమే యున్న నేడు యుద్ధమునందు " అనే పద్యము ఎత్తుకోన్య.

డ్రామా ప్రాక్టీసుసేసే కాడ దినుమూ ఉండే పిలగాండ్లు " యాలే ఇప్పుడు గాదు ఆపద్యము . యంచకారి. ఇప్పుడు " ఆకలముల్ భుజించి అనయంబు వనంబుల " అనే పద్యం సేప్పాలని కేకలు పెట్టిరి. బారికి ఎంకటేసు సేతిత పనమీద కొట్టుకొని అవుగదాలే! దీనెమ్మ మర్సిపోయేన్య " అనుకొంటా ఆకలముల్ భుజించి అనయంబు వనంబుల అనే పద్యం ఎత్తుకొన్య.

డ్రామాల ఆరో అంకం అయిపోయా . సుగ్రీవుడు, జాంబవంతుడు, అంగదుడు దిగిపోవల్ల . ఏడో అంకం మొదులు అయితాది. అయితే సుగ్రీవుని ఏసం కట్టిన బోయ గిడ్డప్ప స్టేజీ దిగేకి లేనంటే దిగేకి లేనని అటుం పెట్టుకొన్య. వాడి బామ్మర్ది వానికి నూర్రుపాయలు దుడ్లు , ఒక గడియారము ముయ్యి బెట్టేకి కనీకీడు నుంచి వచ్చేడ్య అనీ , వాడు యాడున్నా వొచ్చి తనకి ముయ్యి పెట్టాలని అంతవరకి తాను దిగేకి లేనని కొట్లాట పెట్టుకున్య. ఇంగ సూడి అందురూ వాని బామ్మర్దిని పుడికేకి ఉర్లేకి పోయిరి. మైకుల బోయ గిడ్డప్ప బామ్మర్ది యాడున్నా స్టేజి దగ్గరికి రావల్లని అడుక్కోన్య అనుమేశప్ప . యట్లో ఒగాట్ల వాన్ని పట్టుకొచ్చిరి. తప్ప తాగి యాడో పడిపోయింటే ఎత్తుకోనొచ్చిరి. వాడు నీల్గి నీల్గి పడుతావుంటే పిన్నుకు నూర్రుపాయలు గుచ్చి గిడ్డప్ప గాడు ఏసుకున్న దండకి తగిలిచ్చిరి.

"మాబావ పులిలే! " అని వాని బామ్మర్ది గట్టిగా అరసబట్య. అందరూ వాళ్ళిద్దరినీ స్టేజి దింపేట్యాలకు తల ప్రాణం తోకకి వచ్చ్య.

ఐదో అంకంల జాంబవంతుని ఏసం ఏసిన మాదిగి బజారి స్టేజి మీదికి వొచ్చి " నేటితో మన ఆయుష్షుప్రమాణం అంతమైనట్లే " అని సెప్పల్ల.

వొచ్చినోడు అది సెప్పకుండా " నా పెండ్లాము సూస్తుండాద్యా? పండుకునేద్యనా ? సూడండి " అన్య.

ఆయమ్మ సెయ్యేత్తి "ఈడ ఉండానుల్యా మామా . నువ్వు ఆడు " అన్య. అందురూ నొగిరి.

యాగజాము అయిదున్నర గంటలకి డ్రామా అయిపోయా . డ్రస్సు కంపినోల్లు మైకుల భరతుని ఏసం కట్టిన బారికి ఎంకటేసు యాడున్న స్టేజి దగ్గరకి రావల్ల . ఏసం ఇవ్వకుండా అట్లే ఫోయ్యేడ్య. డ్రస్సు, ఆబరణాలు ఇచ్చి ఫోవల్ల అని సెప్పిరి. పాండురంగయ్యకి ఆయప్పని ఎట్లన్న గాని పిలిపిచ్చండి సారూ అని ప్రాదేయ పడిరి.. పాండురంగయ్య ఫ ఇద్దరు పిల్లోల్లని బారికి ఎంకటేసు గాని ఇంటికి పంప్య. పదినిమిసాలకి పిల్లల ఎనకాల ఏసం లోనే బారికి ఎంకటేసు స్టేజికల్ల నడుసుకొంటా వచ్చ్య .

పాండురంగయ్య " యాటికి పోయింటివి లే ? ఎమన్నా బుద్ధి ఉండాద్యా ? ఎవుడన్నా ఏసం ఇప్పెయ్యకుండగా పోతాడా" అని కోపం పడ్య .

" నా పెండ్లాం మొన్న కానుపు అయ్యేద్య కదా? ! దానికోసరం డ్రామా సూసేకి రాల్యా. ఏసం సూపిచ్చి వొద్దాం అని ఇంటికి పోయింటి " అని అనుకొంటా డ్రస్సు కంపెనీ ఆయప్ప దగ్గరకి పోయ.

పాండు రంగయ్య " నాను ఇట్లాంటి నాయండ్లని యాడ సూడలేదు సూడప్ప " అని నొగుకుంటా నెత్తిగీరుకున్య. పొద్దు పొడిసేతలకి డ్రస్సు కంపెనీ వొళ్ళు, రంగాబాయి అందరూ ఎద్దుల బండ్లల్ల ఊరు ఇడిసిరి.

పాండురంగయ్య శిష్యుల కోరిక మీద ఇంగో నాలుగు దినాలు గువ్వలదొడ్డిలోనే ఉండ్య. పాండురంగయ్యకి , అమ్మయ్యకి అందరూ ఇండ్లకి పిలిసి దాన్యం పెట్టిరి. ఇయ్యాల్సిన పద్దెనిమిది నూర్లు ఇచ్చిరి. పాండురంగయ్యని, అమ్మయ్యని సాగానంపేకి ఊరూరే వొచ్చ్య. ఎద్దులబండి వొడ్లు , జొన్నలు, సద్దలు మూటలత నిండి పోయిండ్య.

"తొలుత ఉర్లేకి వొచ్చినప్పుడు సారూ రామణారెడ్డి మాదిరి ఉండ్య , ఇప్పుడు రేలంగీ అయ్యేడ్య " అన్య నగుకుంటా బోయ దుబ్బమ్మ .

పాండురంగయ్య వొస్తానప్ప అని ఎప్పుడయితే అన్యనో అంతా నిశ్శబ్దం అయ్యిడిస్య . "తెలిసో తెలియకో నేర్సుకొనే టప్పుడు తిట్టింటాను ఏమీ అనుకోవొద్దండి" అని కండ్లల్ల నీళ్ళు తుడుసుకొంటా పాండురంగయ్య అన్య.

" అట్లా అనొద్దు సారూ ! మీరు తిడితేనే గదా మాము బాగా నేర్సుకునింది" అని. అందరి కండ్లల్ల నీళ్ళు వొచ్చ్య.

" పోయొస్తా గడ్డం రాముడూ " అన్య రసూలు గాడిని సూసి పాండు రంగయ్య.

వాడు ఏడ్సుకుంటా వొచ్చి సారు సెయ్యి పట్టుకున్య. " సారూ ! ఈవూరు మీది అనుకోండి . ఎప్పుడైనా రండి. మామంతా ఉండాము " అన్య. రసూలుసాబు ఏడిసేది సూసి అందరూ ఎడ్సబట్టిరి. ఏడు నెలలుగా డ్రామా ప్రపంచం లో మునిగి తేలిన ఊరు బాధగా పాండురంగయ్యకి వీడుకోలు సెప్ప్య.

*******

యదావిధిగా పాండు రంగయ్య వొంటేడుదిన్నెలో తన కొట్టం వారసప్పరం లో హార్మోనిపెట్టె ముందు పెట్టుకొని పెండ్లాం సుంకమ్మ తుక్కు గర్వంగా సూసుకొంటా పద్యాలు ఎత్తుకోన్య .

కర్నూలులుల రంగాబాయి ఇంటికి పలుకూరు తిమ్మయ్య వొచ్చినప్పుడంతా గువ్వలదొడ్డిని గుర్తు సేసుకుంటా "ఖోతే అట్లాంటూరికె ఖోవల్ల సూడమ్మా గౌరవము" అని అంటా ఉండ్య . గువ్వలదొడ్డి వొళ్ళు సూపిచ్చిన ప్రేమని రంగాబాయి శానా దినాలు మర్సిపోల్య.

గువ్వల దొడ్డిల నెట్టేకంటి హొటల్ కి వొచ్చినోల్లు " రామాంజినేయ యుద్ధం" డ్రామా గురించే సెప్పుకుంటా ఉండిరి. కొన్ని సంవత్సరాలు రామాంజినేయ యుద్ధం పద్యాలు అందరి నోర్లల్ల నాన్య .

**********